క్లుప్తంగా

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లోకి..


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్‌): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఆయా పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరుతున్నారని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతులబోగుడా గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌, అనిల్‌ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత


మొక్కలు అందజేస్తున్న కమిషనర్‌ సంగారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్‌ కమిషన్‌ సంగారెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపాలిటీలోని 6వ వార్డు బాలాజీనగర్‌లో బుధవారం కౌన్సిలర్‌ గుండ్ల సుజాతతో కలిసి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్‌ రఘురామ్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ వినోద్‌, ఆర్‌పీ కవిత, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్‌ బ్యాగులు పంపిణీ


స్కూల్‌ బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ బస్వరాజ్‌

జహీరాబాద్‌ టౌన్‌: ప్రత్యేక అవసరాలు(దివ్యాంగులు) కలిగిన (భవిత కేంద్రం) పిల్లలకు పట్టణానికి చెందిన ప్రకాష్‌ అతని మిత్రులు కలిసి ఎంఈఓ బస్వరాజ్‌ చేతుల మీదుగా బుధవారం బ్యాగులు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ బస్వరాజ్‌ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాలు కొండంత అండగా ఉన్నాయని, దివ్యాంగులకు ఆదుకొనేందుకు దాతలు ముందుకు రావాలని సూచించారు. బ్యాగులు, పెన్నులు పంపిణీ చేసిన ప్రకాష్‌ మిత్ర బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌, ప్రేమ్‌, రాజు, ఏసన్న, పురుషోత్తం, బాబు, కనకరాజ్‌, రాజ్‌కుమార్‌, ఉదయ్‌ పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ చేయాలి


పశుసంవర్ధక శాఖ జేడీ వసంతకుమారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్‌): రెండో విడతలో భాగంగా ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయాలని కోరుతూ జోగిపేట బీరప్పస్వామి గొర్రెల కాపరుల సంఘం కార్యదర్శి కడాల రాములు సంఘం సభ్యులతో కలిసి బుధవారం సంగారెడ్డి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వసంతకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు పంపిణీ చేయాలని ఆరు నెలలుగా గొర్రెల పెంపకందారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని కోరారు. సంఘం సభ్యులు లింగమయ్య, మల్లేశం, రాములు పాల్గొన్నారు.

సైనిక పాఠశాలకు జోగిపేట విద్యార్థి ఎంపిక


పద్మ సుదీప్‌

వట్‌పల్లి(అందోల్‌): జోగిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి పద్మసుదీప్‌ సైనిక పాఠశాలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన ఆల్‌ ఇండియా సైనిక్‌ స్కూల్స్‌ ఎంట్రెన్స్‌ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ ఉమ్మడి రాష్ట్ర పరిధిలో 32వ ర్యాంకు, ఆల్‌ ఇండియా స్థాయిలో 917వ ర్యాంకు సాధించి హర్యానా రాష్ట్రంలోని సైనిక్‌ స్కూల్‌ రేవారి పాఠశాలకు ఎంపికయ్యాడు. ఎంట్రెన్స్‌ పరీక్షలు, మెడికల్‌ టెస్టులను విజయవంతంగా పూర్తిచేసి పాఠశాలలో అడ్మిషన్‌ అయ్యారు. విద్యార్థి ఎంపికతో పాఠశాల హెచ్‌ఎం నర్సింహులు, పీఆర్‌టీయూ మాసపత్రిక సంపాదకులు మానయ్య, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరోత్తంకుమార్‌, రాజమల్లు, పాఠశాల ఉపాధ్యాయులు పద్మసుదీప్‌ను సన్మానించారు.

పేదల ప్రాణాలతో చెలగాటం

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్లు
- అనుమతులు లేకున్నా ప్రైవేట్‌ ఆస్పత్రుల నిర్వహణ
- గుట్టుచప్పుడు కాకుండా గర్భిణులకు ఆపరేషన్‌లు
- వైద్యాధికారుల పర్యవేక్షణ కరువు



ఇటీవల మూసివేయించిన ఓ ప్రైవేట్‌ సెంటర్‌ ఇదే..

జిన్నారం(పటాన్‌చెరు): వైద్యశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కనీస అర్హత లేని వారు వైద్యం చేస్తుండటంతో ప్రజల విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్‌లలో గర్భిణులకు ఆపరేషన్లు చేస్తున్నారు. ఖరీదైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో అందిస్తామని మాయమాటలు చెబుతూ పేదల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. విషయం తెలిసినప్పటికీ వైద్యాధికారులు కాసులకు కక్కుర్తిపడి చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్‌ పరిధిలో సుమారు 50వేల జనాభా ఉంటుంది. పారిశ్రామిక ప్రాంతం కావటంతో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ నివాసం ఉంటూ స్థానిక పరిశ్రమల్లో పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. మున్సిపల్‌ పరిధిలో 30వరకు ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ, అనుమతులు లేకపోయినా మెడికల్‌ షాపుల నిర్వాహకులు సైతం ఆస్పత్రులు కొనసాగిస్తున్నారంటే ఇక్కడి పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

తక్కువ ఖర్చుకే వైద్యమని నిలువు దోపిడీ

ఎలాంటి వైద్య అర్హతలేని వారు అనుమతులు లేకుండా ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్‌ పేరిట ఆస్పత్రులను నిర్వహిస్తున్నారు. బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలో ఉండే ఇతర రాష్ట్రాల పేదలు అనారోగ్యానికి గురైనప్పుడు ఇక్కడి ప్రైవేటు వైద్యులను సంప్రదిస్తున్నారు. దీంతో తక్కువ ఖర్చుకే వైద్యం అందిస్తున్నామంటూ టెస్టుల పేరిటా అందినకాడికి దోచుకుంటూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

ఘటనలు జరిగినప్పుడే తనిఖీలు

అనుమతులు లేకుండా ఆస్పత్రులను నిర్వహించడమే కాకుండా గర్భిణులకు డెలివరీలు, ఆపరేషన్లు చేస్తున్నారు. రెండేళ్లలో పది వరకు డెలివరీలు చేసిన విషయాలు బయటకు వచ్చాయి. తాజాగా ఒక గర్భిణికి ఆపరేషన్‌ చేసేందుకు యత్నించగా శిశువు మృతి చెందింది. ఇలాంటి ఘటనలు చాలావరకు జరిగాయి. కొన్ని ఘటనలను తెలియకుండా ఆస్పత్రుల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఘటన జరిగినప్పుడే అధికారులు ఆగమేఘాల మీద వచ్చి ఆస్పత్రిని మూసివేయించి చేతులు దులుపుకుంటున్నారు. స్థానికంగా ఉన్న ప్రైవేట్‌ ఆస్పత్రుల యాజమాన్యాలకు జిల్లా వైద్యాధికారులు తొత్తులుగా మారారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి అనుమతులు లేని ప్రైవేట్‌ ఆస్పత్రులను మూసివేయించాలని స్థానిక ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.


శిశువు మృతిపై విచారణ జరుపుతున్న అధికారులు (ఫైల్‌)

చర్యలు తప్పవు

ప్రైవేట్‌ ఆస్పత్రుల నిర్వాహణకు వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు తప్పనిసరి ఉండాలి. నిబంధనలు పాటించకుండా ఆస్పత్రులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ గుర్తింపులేని ఆస్పత్రులను సీజ్‌ చేస్తాం. పారిశ్రామిక ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలపై అవగాహన కల్పిస్తాం.

: నాగనిర్మల, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం


క్రీడాకారులతో ఎంపీపీ, నాయకులు

హత్నూర (సంగారెడ్డి): మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎంపీపీ వావిలాల నరసింహులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని దౌల్తాబాద్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో వాలీబాల్‌ ఆడే క్రీడాకారులకు స్పోర్ట్స్‌ టీషర్ట్స్‌ ఎంపీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మండల యువత అధ్యక్షుడు తుమ్మలపల్లి కిషోర్‌, బీఆర్‌ఎస్‌ మండల నాయకులు ఎండీ గౌస్‌, వార్డుసభ్యులు సంతు, హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, పీఈటీ రామరాజు పాల్గొన్నారు.

హానర్‌ ల్యాబ్‌ పరిశ్రమ యాజమాన్యం ఆధ్వర్యంలో..


నోటుబుక్స్‌ పంపిణీ చేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గుండ్లమాచునూర్‌ గ్రామ శివారులోని హానర్‌ ల్యాబ్‌ పరిశ్రమ యాజమాన్యం పల్పానూర్‌, గుండ్ల మాచునూర్‌ ఎంపీపీ ఎస్‌ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌ బుక్స్‌, బ్యాగులు, డ్రెస్సులు బుధవారం పంపిణీ చేసింది. సర్పంచ్‌ జయంతి శశిధర్‌రెడ్డి, పరిశ్రమ ప్రతినిధి వెంకటరెడ్డి, గ్రామకార్యదర్శి రమణారెడ్డి, గ్రామపంచాయతీ కోఆప్షన్‌ సభ్యుడు శ్రీహరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాహనాజ్‌ బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘గీతం’లో పీఎక్స్‌ఆర్‌డీ ల్యాబ్‌ ప్రారంభం


ప్రయోగశాలను ప్రారంభిస్తున్న కెమిన్‌ టెక్‌ సీఈవో డాక్టర్‌ శర్మ

పటాన్‌చెరు టౌన్‌: గీతం స్కూల్‌ ఆఫ్‌ సైన్స్‌లో పౌడర్‌ ఎక్స్‌–రే డిఫ్రాక్షన్‌(పీఎక్స్‌ఆర్‌డీ) ప్రయోగశాలను బుధవారం కెమిన్‌ టెక్‌ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్‌ జేఏఆర్పీ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఎస్‌ఆర్‌డీ వినియోగాలు అనే అంశంపై నిర్వహించిన ఒకరోజు జాతీయ కార్యశాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్‌ శర్మ ఆ ప్రయోగశాల ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. హైదరాబాద్‌ కేంద్రీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ప్రతాప్‌, వర్క్‌షాప్‌ చైర్మన్‌ ప్రొఫెసర్‌ రాంబాబు, వర్క్‌షాప్‌ నిర్వాహకులు డాక్టర్‌ సురేంద్రబాబు, డాక్టర్‌ నరేష్‌కుమార్‌, డాక్టర్‌ ఉమాదేవి పాల్గొన్నారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ..
ఒకరికి తీవ్ర గాయాలు

కంగ్టి(నారాయణఖేడ్‌): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన కంగ్టి మండలంలోని తడ్కల్‌ ఎంపల్లి రోడ్డుపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కర్ణాటకలోని ఆలూరు గ్రామానికి చెందిన కామారెడ్డి జిల్లాలోని పిట్లం వైపు వెళ్తున్నాడు. కాగా మండలంలోని గాంధీనగర్‌ గ్రామానికి చెందిన రైతు నారాగౌడ్‌ తడ్కల్‌కు వస్తున్న క్రమంలో ఎదురెదురుగా వాహనాలు ఢీకొనడంతో నారాగౌడ్‌కు కాలు విరిగింది. గమనించిన స్థానికులు నారాగౌడ్‌ను తడ్కల్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స అందించి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి రిమాండ్‌

సంగారెడ్డి అర్బన్‌: సంగారెడ్డి పట్టణంలోని ఫ్లిప్కార్ట్‌ కొరియర్‌ సర్వీస్‌లో ఇటీవల చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి పట్టణ ఇన్‌స్పెక్టర్‌ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన గడ్డం సాయిదత్తు ఆదివారం అర్ధరాత్రి ఫ్లిప్కార్ట్‌ కొరియర్‌ సర్వీస్‌లోకి చొరబడి రూ.3,69,679 దొంగిలించాడు. టెక్నికల్‌ డాటా ఆధారంగా నిందితుడి అరెస్టు చేసి నగదు, సెల్‌ఫోన్‌, స్కూటీ, హెల్మెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్రైమ్‌ సిబ్బంది షాకీర్‌, మల్లారెడ్డి, శేఖర్‌ నేతృత్వంలో దొంగను పట్టుకున్నట్టు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారంలో నిర్వహించిన డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడిని ఏడుగురిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఆరుగురికి రూ.2 వేల చొప్పున, మరో వ్యక్తికి రూ.3 వేల జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం


ప్రదీప్‌ కుమార్‌(ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ జగదీష్‌ తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండల పరిధిలోని చిట్కుల్‌ గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్‌ ఎలక్ట్రీషన్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 13వ తేదీన ప్రదీప్‌కుమార్‌ ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతని కోసం కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు అదృశ్యంపై తల్లి విజయశీల ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాలి


మాట్లాడుతున్న మాణిక్‌ ప్రభుమహారాజ్‌

నారాయణఖేడ్‌: ధర్మరక్షణ కోసం సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాలని హుమ్నాబాద్‌ మాణిక్‌నగర్‌ పీఠాధిపతి జ్ఞానరాజ్‌ మాణిక్‌ ప్రభు మహారాజ్‌ అన్నారు. నారాయణఖేడ్‌ పట్టణంలో అధికశ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మహతీ జ్యోతిష్యాలయం వ్యవస్థాపకులు గురుజ్యోతి ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన రుద్ర చండీ హోమం ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రసగీతి సాహితీ సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకుడు మహారెడ్డి మహిపాల్‌రెడ్డి, గురుజ్యోతికి పురోహిత సార్వభౌమ బిరుదును ప్రదానం చేశారు. కార్యక్రమ నిర్వాహకులు స్వర్ణ కంకణాన్ని జ్ఞానరాజ్‌ మహారాజ్‌చే ధరింపచేశారు. కొండాపూర్‌ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్‌, ఏకాంబ పీఠాధిపతి కరణ్‌ గజేంద్రభారతి మహారాజ్‌, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్‌ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- సర్కార్‌ బడుల్లోనే నాణ్యమైన విద్య
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్‌ నాయకత్వంలో ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రావడంతో పాటు, విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్‌ గ్రామ పరిధిలోని మైనార్టీ రెసిడెన్షియల్‌ పాఠశాలకు రూ.లక్ష సొంత నిధులతో కొనుగోలు చేసిన మైక్‌సెట్‌, క్రీడాపరికరాలు, కుర్చీలను క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి ఒక్కో విద్యార్థిపై రూ.1.20లక్షల వ్యయం చేస్తోందన్నారు. విద్యారంగానికి పెద్దపీట వేస్తూ నాణ్యమైన విద్య అందిస్తోందని వివరించారు. మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్‌, మాజీ కార్పొరేటర్‌ అంజయ్య, సీనియర్‌ నాయకులు వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్‌ పాల్గొన్నారు.

కోర్టు స్థలం పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రమైన జిన్నారంలో జ్యూడీషియల్‌ మెజిస్ట్రేట్‌ కోర్టులను ఏర్పాటు చేసేందుకు న్యాయవాదులు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. తహశీల్దార్‌ కార్యాలయం వెనకభాగంలో ఉన్న భవనాన్ని కోర్టు ఏర్పాటుకు ఎంపీపీ రవీందర్‌గౌడ్‌ న్యాయవాదులకు చూపించారు. అనంతరం న్యాయవాదులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో సమావేశమయ్యారు. కోర్టును ఏర్పాటు చేసేందుకు తగిన భవనాలు అందుబాటులో ఉన్నాయని, త్వరగా కోర్టును ఏర్పాటు చేయించేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. జెడ్పీవైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.


న్యాయవాదులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

చెత్త తొలగించం.. రోడ్లు ఊడ్చం

- అవసరమైతే ఉద్యోగాలకు రాజీనామా
- ఇతర శాఖలకు కేటాయించాలని వీఆర్‌ఏల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

జహీరాబాద్‌: రెవెన్యూశాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఏలకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి పలు శాఖలకు కేటాయించింది. అందులో భాగంగా 10వ తరగతిలోపు చదువుకున్న వారికి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులుగా విధులను కేటాయించింది. బుధవారం విధుల్లో చేరేందుకు 26 మంది వీఆర్‌ఏలు జహీరాబాద్‌ మున్సిపల్‌ కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మల్లారెడ్డి వారి విధుల గురించి వివరించి, శానిటరీ ఇనిస్పెక్టర్‌ను కలిసి విధుల్లో చేరాలని సూచించారు. విధుల్లో చేరి రోడ్లపై ఉన్న చెత్తను ఊడ్చాలని, మురికి కాలువలను శుభ్రం చేయాలని మున్సిపల్‌ సిబ్బంది తెలిపారు. ఇందుకు వారు విముఖత వ్యక్తం చేశారు. ఇప్పటివరకు తాము గ్రామాల్లో హుందాగా విధులను నిర్వహించామని, రోడ్లు ఊడ్చే పనులు, మురుగుకాలువలు తీసే పనులు చేయబోమని తేల్చి చెప్పారు. ఇలాంటి పనులు తప్పవని బలవంతం చేస్తే తాము ఉద్యోగాలకైనా రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు. విధుల్లో చేరేందుకు వస్తే తమకు అసలు విషయం తెలిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇతర శాఖలను కేటాయించాలని, లేనట్లయితే కలెక్టర్‌ను, ఉన్నతాధికారులను కలిసి నివేదిస్తామన్నారు. అవసరమైతే ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.

వీఏఓలపై వేధింపులు అరికట్టాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఐకేపీ వీఏఓలు

కొండాపూర్(సంగారెడ్డి): వీఏఓలపై సీసీల వేధింపులు ఆపాలని, వీఏఓలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఐకేపీ ఏపీఎం, సీసీలను తక్షణమే సస్పెండ్‌ చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్‌ బాబురావు డిమాండ్‌ చేశారు. బుధవారం కొండాపూర్‌లోని ఐకేపీ కార్యాలయం వద్ద వీఏఓలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జనరల్‌ బాడీ సమావేశంలో ఐకేపీ వీఏఓలను అవమానించిన ఏపీఎం, సీసీలను సస్పెండ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. వీఏఓలపై తొగరపల్లి, తేర్పోల్‌ క్లస్టర్‌ సీసీలు అత్యుత్సాహంతో వీఏఓలను వేధిస్తున్నారని మండిపడ్డారు. వీఏఓలపై వేధింలు ఆపకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఐకేపీ వీఏఓల సీఐటీయూ అనుబంధ యూనియన్‌ నాయకులు శ్రీను, రాజాగౌడ్‌, సురేష్‌, అన్నపూర్ణ, లక్ష్మి, అశ్విని, విజయలక్ష్మి, ప్రభావతి, సరిత, మాధవి పాల్గొన్నారు.

గీతవృత్తిని రక్షించాలి


మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్‌

మనూరు(నారాయణఖేడ్‌): పోరాటాలతోనే కల్లుగీత వృత్తికి రక్షణ ఉంటుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్‌ అన్నారు. మనూరు మండలంలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద బుధవారం గౌడ సంఘం సామాజిక చైతన్య యాత్రసభ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గీత కార్మికులందరికీ రూ.లక్ష బీసీ బంధు పథకాన్ని వర్తింపచేయాలన్నారు. అదేవిధంగా బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. జిల్లా కమిటీ నాయకులు అంజాగౌడ్‌, కుమార్‌గౌడ్‌, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పీహెచ్‌సీ భవనానికి స్థలం పరిశీలన**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అనంతారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి బుధవారం సర్పంచ్‌ చిమ్ముల దీపనరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థలం పరిశీలించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి సురేష్‌, ఉపసర్పంచ్‌ స్వరూప లక్ష్మణ్‌, వార్డుసభ్యులు రమణ, భిక్షపతి, యాదయ్య, నాయకులు యాదిరెడ్డి, గోపాల్‌, సాయిరెడ్డి పాల్గొన్నారు.

◆ **ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్‌ పరిధిలోని ఎంఐజీ కాలనీలో నిర్మించనున్న ప్రహరీకి భారతినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ సింధు ఆదర్శ్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పరిశీలన..

రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువు కట్టపై నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్‌ పుష్పనగేష్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ **సమస్యల పరిష్కారానికి కృషి**

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌యాదవ్‌ అన్నారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని సాయిరామ్‌నగర్‌, బండ్లగూడలోని నేతాజీనగర్‌లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాయిరాంనగర్‌లో సీసీ రోడ్ల సమస్య ఉందని, నేతాజీనగర్‌లో కాలనీకి సమీపంలో ఉన్న చెరువు నీరు కాలనీలోకి వస్తున్నాయని కాలనీవాసులు వివరించగా జీహెచ్‌ఎంసీ వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ మహేష్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు.

◆ **దివ్యాంగులకు బస్‌పాసులు పంపిణీ**

హత్నూర(సంగారెడ్డి): 50శాతం సబ్సిడీపై దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న బస్‌పాసులను మండల పరిధిలోని మధుర గ్రామానికి చెందిన పలువురు దివ్యాంగులకు సర్పంచ్‌ మాధవిన వీన్‌గౌడ్‌ బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ **ఎమ్మెల్సీ కవితను కలిసిన స్ట్రీట్‌ చిల్డ్రన్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు రాజేశ్‌**

మనూరు(నారాయణఖేడ్‌): మనూరు మండలంలోని బోరంచ గ్రామానికి చెందిన స్ట్రీట్‌ చిల్డ్రన్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు రాజేశ్‌ బుధవారం ఎమ్మెల్సీ కవితను, రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌ అలీలను కలిశారు. అనాథలకు సంబంధించి పలు విషయాలను వారికి వివరించినట్టు రాజేశ్‌ తెలిపారు.

◆ **యువజన కాంగ్రెస్‌ ప్రచార కమిటీ ఇన్‌చార్జిగా రియాజ్‌ అలీ**

హత్నూర (సంగారెడ్డి): నర్సాపూర్‌ త్వరలో నిర్వహించనున్న సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా యువజన కాంగ్రెస్‌ ప్రచార కమిటీ ఇన్‌చార్జిగా నర్సాపూర్‌ నియోజకవర్గ యువజన కాంగ్రెస్‌ అధ్యక్షుడు రియాజ్‌ అలీనీ నియమిస్తూ జాతీయ యువజన కాంగ్రెస్‌ అధ్యక్షుడు బివి శ్రీనివాస్‌ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా రియాజ్‌ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్‌ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

◆ **రోగులకు పండ్లు పంపిణీ**

నారాయణఖేడ్‌: ఉమ్మడి మెదక్‌ జిల్లా జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్‌ షెట్కార్‌ జన్మదినాన్ని ఆయన సోదరుడైన మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షుడు సురేశ్‌ షెట్కార్‌ ఆధ్వర్యంలో బుధవారం నారాయణఖేడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులకు అల్పాహారం, పండ్లను పంపిణీ చేశారు. టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్‌, యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్‌ షెట్కార్‌, ముఖ్య నాయకులు రషీద్‌, తాహెర్‌, సాయిలు పటేల్‌, నియోజకవర్గంలోని కాంగ్రెస్‌ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.